

# కథా కౌముది

## టికిలి వరుణ్ పారుపల్లి

జులై నెలాఖరు రోజులు, శుక్రవారం ఉదయం. సమయం అటూఇటుగా ఆరున్నర కావొస్తోంది. 'లింగంపల్లి' నుండి 'నాంపల్లి' వెళ్లే లోకల్ ట్రైన్ 'చందానగర్' స్టేషన్ దాటుతోంది. చెత్త కుండీలను మోసుకెళుతున్న మున్సిపాలిటీ లారీలు ఏనుగుల గుంపులా రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న రోడ్డు మీద నెమ్మదిగా ఊగుతూ కదులుతున్నాయి. తెల్లవారుఝాము నుండి రోడ్లు ఊడ్చి అలిసిపోయిన పారిశుధ్య కార్మికులు టీ బండి దగ్గర నేల మీద కూలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు. బద్ధకంతో ఇంకా నిద్ర లేవని నగరానికి పాల ప్యాకెట్లు, వార్తాపత్రికలు పంచిపెట్టి డెలివరీ కుర్రాళ్ళు... రైలు కట్టకు రెండు వైపులా ఉన్న చిన్న చిన్న కాలనీల లోని వారి ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇంకో గంటలో వారి బతుకు సమరంలో మరో అంకం మొదలవుతుంది.

అలాంటి ఒక కాలనీలో, ఒక వీధిలో, ఒక ఇంట్లో... "నువ్వూ, నీ కొడుకూ ఏమన్నా చేసుకోండి. నేను పనికి పోతున్న" అని కేకేసి సమాధానం కోసం ఎదురు చూడకుండా వీధిలోకి నడిచింది 'వసంత'. వాళ్ళుండే సందు దాటి మెయిన్ రోడ్ ఎక్కేసరికి, షేర్ ఆటోలు సిద్ధంగా ఉన్నాయి. "రా బేటా... రోజూ ఆరింటి బండి పోయేలోపే వచ్చెడి దానివి, ఇయ్యాల లేటైందే?" నవ్వుతూ అడిగాడు నర్సింహ.

"ఏం లే నర్సిమ్మన్నా. ఎల్లుండి బోనాల పండగొస్తుంది కదా ఇల్లు సర్దుకుంటుండే. ఆ పనిలబడి రాత్రి లేటైంది," అంటూ నర్సింహ 'ఆటో' ఎక్కి కూర్చుంది వసంత.

ఇంకా నలుగురైదుగురు వస్తేగానీ 'ఆటో' కదలదు. 'ఆటో' లో కూర్చున్న వసంతకు మెడనరాలు జివ్వున లాగుతున్నాయి. ఒళ్ళంతా పచ్చిపుండులా ఉంది. అసలైతే సెలవు పెట్టేసేదే. కానీ బోనాలకు మళ్ళీ ఆదివారం సెలవంటే కుదరదు. అయినా ఇల్లు అనబడే ఆ నరకంలో ఉండే కన్నా పనికి పోతే కనీసం మనసైనా వేరే విషయాల పైకి మళ్ళుతుంది.

వసంత తండ్రి మున్సిపాలిటీ లారీ డ్రైవర్ గా పని చేసేవాడు. మూడేళ్ళ కిందటి వానాకాలంలో పని ముగించుకుని ఇంటికి వస్తూ తెరిచి ఉన్న 'మ్యాన్ హోల్' లో పడి చనిపోయాడు. ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం అప్పులకే సరిపోలేదు. ఇంటి పెద్ద పోయాడు కాబట్టి మున్సిపాలిటీ వారు జాలితో వసంత వాళ్ళ అమ్మకు కాంట్రాక్టు పోస్ట్ ఇచ్చారు. వేన్నీళ్ళకు చన్నీళ్లలా పది పాసైన వసంత కూడా తన కంటే రెండేళ్లు చిన్నవాడు, అందరూ ముద్దుగా 'సంతుగాడు' అని పిలిచే 'సంతోష్' చదువు కొనసాగాలని, తన చదువు ఆపేసి ఇళ్లల్లో పనికి కుదిరింది. వాడు పది పాసైతే వాడికీ మునిసిపాలిటీలోనే ఏదైనా నౌకరీ వస్తుందని పాపం ఆమె ఆశ. కానీ, చెడు స్నేహాలతో చేయిదాటిన సంతుగాడు తొమ్మిదో తరగతే పాస్ కాలేదు. తర్వాత వాడు కూడా చదువు మానేసి మెకానిక్ షెడ్ లో పనికి చేరాడు. రాత్రిళ్ళు తాగి రావడం, జులాయి పనులు చేసి ఏదో ఒక గొడవ ఇంటి మీదకు తేవడం. బయట గొడవలు లేవంటే, ఏదో ఒక విషయం మీద ఇంట్లో అమ్మ, అక్కల మీద తగవులాడడం వాడికి అలవాటుగా మారింది. వాడి నోటికి జడిసి ఇరుగుపొరుగు కానీ, చుట్టాలు కానీ వాణ్ణి మందలించి దారిలో పెట్టే సాహసం చేయరు.

నిన్న సాయంత్రం... వసంత స్నేహితురాలు 'కుమారి' వాళ్ళ అక్క 'కమల' నిశ్చితార్థం జరిగింది. 'కుమారి' వాళ్ళింటికి పనిలో సాయం కోసం వెళ్లి వచ్చిన వసంత వాళ్ళ అమ్మతో "అమ్మా, కమలక్క ఫంక్షన్ కి పార్లరు వాళ్లొచ్చి మేకప్ చేసిన్రు తెలుసా? మేకప్ తోని అక్క తెల్లగా ఎట్ల మెరిసిపోతుండెనో! పార్లర్ అక్క నన్ను జూసి ఇదిగో ఈ టికిలీ ప్యాకెట్ ఇచ్చింది. ఎప్పుడూ కుంకుమ, తిలకం బొట్లే కదా పెట్టుకునేది. అప్పుడప్పుడూ ఇది కూడా పెట్టుకుంటే మంచిగుంటది కదా?" అని సంబరంగా అంటుండగానే సంతుగాడు ఇంట్లోకి వచ్చాడు. వస్తూనే, "ఆఁ, ఇయ్యాల టికిలీలు పెట్టుకో, రేపు లిపిస్టిక్కులు వేసుకో, ఎల్లుండి ఎవుడో ఒకణ్ణి తగులుకో. నిన్ను ఇట్లాగే వదిలేస్తే బజారు దాని లెక్క తయారైతవే. కుమారి నువ్వూ కలిసి ఏమేం చేస్తున్నర్రో ఏడేడ తిరుగుతున్నర్రో నాకు తెల్వదనుకోకు. సురేష్ గాడు చెప్పిండు... మొన్న సినిమా టాకేసుల ఎవనితోనో కనిపిచ్చింరంట. ఎవుడే వాడు? ఇంకోసారి ఆ కుమారి తో కనిపిచ్చినా, పిచ్చి పిచ్చి కతలు పడ్డా బొక్కలిరుగుతై. నీ మొఖానికి టికిలీలు కావాలా? టికిలీలు?" అంటూ వసంత చేతి లోని బొట్టు బిళ్లల ప్యాకెట్ ను లాక్కుని, మురికి కాలువలో పడేసాడు. వాడి మాటలకు వసంతకు ఏడుపు ముంచుకొచ్చింది.

ఎర్రబడ్డ ముఖంతో, 'నువ్వెవనివిరా నా మీద జులుం చేయనీకి? నీ బొడ్డు కాడ ముల్లెతో కొంటలేవు గదా... నేను గూడ పైసలు కమాయిస్తున్న గాని నీ లెక్క ఫాల్తు ఖర్చులు పెడతలేను. నీ జీతం, అమ్మ జీతం పైసలు నీ తాగుళ్ళు, తిరుగుళ్ళకి తగలేస్తున్నవ్. నా జీతం పైసల్తోనే ఈ ఇల్లు నడుస్తాంది. అయినా ఈ ముసిల్ది నిన్ను ఒక్క మాట అననియ్యదు. మొన్న సినిమాకు పోయింది కుమారి వాళ్ళ తమ్ముడు, చెల్లి తోని. అమ్మకి చెప్పే పోయినా. ఆ సురేష్ గాడు, ఎక్కడ కనబడ్డా వెకిలి నవ్వులు నవ్వుతా ముట్టుకోవాలని సూత్తడు. వాని గురించి నీకు చెప్పినా, అమ్మకి చెప్పినా, ఒక్కరన్నా నమ్మినారా? మీదికెల్లి 'నువ్వేం జెయ్యకుంటే వాడెందుకు నీ జోలికొస్తడు?' అని ఎదురు నన్నే బనాయిస్తరు. ఎన్ని సార్లు ఛీ కొట్టినా వానికీ ఇజ్జతుండదు. నేను బజారుదాన్ని, నీ దోస్తు పత్తిత్తు! నీ కన్న పెద్ద దాన్నని కూడా సూడకుండ నోటికేదొస్తే అది

అంటవా? ఏమైంది రా నేను టికిలీలు పెట్టుకుంటే? నీ ముల్లె ఏమన్న పోతదా? నీ సోకులకి ఎన్నడన్న అడ్డం చెప్పిననా? పెట్టుకుంట, బరాబర్ పెట్టుకుంట. ఏం చేస్కుంటవో చేస్కో పో" అని విసురుగా బయటకు నడిచింది.

వసంత మాటలకు వాడి అహం దెబ్బతింది. ఇంటి ముందు అరుగు మీద కూర్చున్న వసంతను జడ పట్టుకుని ఇంట్లోకి ఈడ్చుకు వెళ్ళిన సంతుగాడు, ఆమెను ఇంటి గోడకేసి అదిమి పట్టుకుని కొట్టసాగాడు. దెబ్బలకు తాళలేక 'ఇంకా కొడితే చచ్చిపోతా... వదిలెయ్యమని' బతిమాలినా వినిపించుకోలేదు. చివరకు పక్కింట్లో ఉండే వాడి దోస్తులు వచ్చి విడిపిస్తే మళ్ళీ వాళ్ళతోనే కలిసి తాగడానికి వెళ్ళాడు. అలా వెళ్లిన వాడు తెల్లవారేటప్పుడు ఇల్లు చేరాడు. రాత్రి అంత రాద్ధాంతం చేసి, ఇప్పుడు పీనుగ లాగ మంచానికి అడ్డం పడి నిద్రపోతున్న కొడుకును లేపి, వాడికి సపర్యలు చేస్తున్న తల్లిని ఆపబోయింది, వసంత. 'పోవే, వాడు మొగోడు. తాగుతడు, తిరుగుతడు, పంటడు. నీకేంది? రేపు నువ్వు ఎవన్నో లగ్గం చేసుకుని ఎల్లిపోతే వీడే నన్ను సూసుకునేది' అన్న వాళ్ళమ్మ మీద గయ్యిమని అరిచి, పనికి బయల్దేరింది.

ఒకప్పుడు తన చెయ్యి పట్టుకుని అమాయకంగా బడికి వెళ్లిన తన తమ్ముడు, ఇప్పుడు తన మీద దౌర్జన్యం చేస్తున్నాడు. 'అక్కా' అని పిలిచిన నోటి నుండి ఇప్పుడు 'ఒసే' అని తప్ప వేరే పిలుపు రావడం లేదు. 'బాపు బతికుంటే పరిస్థితి వేరేలా ఉండేదేమో! మూడేండ్లలో మా బతుకులు ఎట్ల మారిపోయినయ్' అనిపించి గాఢంగా నిట్టూర్చింది, వసంత. తను ఆ ఆలోచనల్లో ఉండగానే 'కుమారి' వచ్చి ఆటో ఎక్కింది. రాగానే వసంతను చూసి, 'ఏమైందే అట్లున్నవ్? మెడ మీద ఆ మరకలేంది?' అని అడిగింది కుమారి. 'ఏముంది? సంతుగాడు మల్ల తాగొచ్చి లొల్లి వెట్టిండు. వానికి బయం జెప్పెటోళ్లు లేక ఆగం అవుతుండు. మాయమ్మేమో వానికేం జెప్పలేదు. వాడు మొగోడు, వాడు ఏమైనా చేస్తడు అని వానికే సపోర్టు చేస్తది. నిన్న పార్లరక్క టికిలీలు ఇచ్చింది కదా... దానిమీద పెద్ద లొల్లయ్యింది మా ఇంట్ల. చిన్న చిన్న క్వాయిషులు కూడా తీర్చుకోలేం... మనం సంపాయించిన పైసల మీద కూడా మనకేం హక్కుండది. ఏం బతుకులే మనయ్యి? మనలాంటి పేదోళ్ల కొంపల్లోనే ఇట్లుండేది. పైసలున్నోళ్ల ఇళ్లలో ఇట్లుండదు. వాళ్ళు ఆడా మగా తేడా లేకుండా అన్ని పనులూ జేసుకుంటరు. నేను పనిచేసే దగ్గర అక్క, అన్న ఇద్దరూ జాబ్ చేస్తరు. ఒక్కోసారి అక్క ఆఫీసుకి పోతే అన్న వంట చేస్తడు. అన్న మీటింగులో ఉంటే అక్క ఒక్కత్తే బయటికి వెళ్లి పనులు చేసుకొస్తది. చదువుకుని, ఉద్యోగాలు జేసే వాళ్ళకి మన లెక్క తన్నులు తినే హాలత్ ఉండది. ఏంజేస్తం... మన బతుకులింతే' మరోసారి నిట్టూర్చింది వసంత.

'అట్లగాదే... నువ్వు భీ మెత్తటి దానివి. వాడు తిడితే కొడితే పడుడేంది? వాడు మొదటిసారి చెయ్యెత్తినప్పుడే చెప్పినా. ఎదురు తిరగాలె అని. బక్కపీసు గాడు, నువ్వు ఒక్క గుద్దు గుద్దితే గుడ్లెల్లబెడతడు. నీకే బయమెక్కువ,' గట్టిగా చెప్పింది కుమారి.

"ఔ బేటా, కుమారి మంచిగ చెప్పింది. సంతుగాన్ని దారిల పెట్టాల్నంటే ఎవురో ఒకరి బయముండాలే. ఇంట్లో మీకే కాదు, బయట మాలాంటి వాళ్లకు కూడా వాడు ఇజ్జత్ ఇస్తలేదు. గల్లీగల్లీకి లొల్లే. ఇట్లనే వదిలేస్తే ఏదో

ఒకరోజు వాని బాడీ సైడుకాల్వల దొరుకుతది. వాని పోకడ చాల ప్రమాదం బిడ్డా!" అని వంతపాడిన నర్సింహ మాటలకు గుండెల్లో ఏదో తెలియని గుబులేసింది వసంతకి.

పావుగంటలో ఆటో వాళ్ళు దిగవలసిన చోటుకు చేరుకుంది. అదొక పెద్ద అపార్టుమెంట్ కాంప్లెక్స్. దాదాపుగా రెండువేల వరకు ఫ్లాట్స్ ఉంటాయి. అక్కడ ఉండేది అందరూ ఎగువ మధ్యతరగతి లేదా ధనిక వర్గం వారు. అన్ని ఇళ్ళు ఉండడం వలన ఇంట్లో పని చేయడానికి పనిమనుషులకు డిమాండ్ కొంచెం ఎక్కువే. రోజూ పని చేసే ఇళ్లే కాక అప్పుడప్పుడు అదనంగా వేరే ఇళ్ళు కూడా దొరుకుతాయి. ఎవరింట్లోనన్నా పనిమనిషి రాకపోయినా, ఎక్కువ పని ఉన్నా, ఒక్కరోజు పని కోసం పిలుస్తూ ఉంటారు. నెలంతా చేస్తే వచ్చే జీతం ఒక్కింటికి రెండు వేలు అయితే, ఒక్క రోజు పనికి ఇంటికి కనీసం వంద సంపాదించవచ్చు. కాబట్టి, తన పని అయిపోయాక కూడా ఒక్క రోజు పని కోసం ఎవరైనా పిలుస్తారేమో అని గేట్ బయట మధ్యాహ్నం వరకు ఎదురుచూస్తుంది, వసంత.

ఆ రోజు ఆఖరి ఇంట్లో పని పూర్తి చేసుకుని బయల్దేరుతున్న వసంతతో, "వసంతా, రాగిణి అని పక్క ఫ్లాట్ లో ఉంటారు. వాళ్ళ పనమ్మాయి రాలేదట. ఈ ఒక్కరోజు వాళ్లకు పని చేస్తావా?" అని అడిగింది ఆ ఇంటిగలావిడ. "సరే అక్కా, చేస్తా' అని చెప్పి వెళ్లి పక్కింటి డోర్ బెల్ మోగించింది, వసంత.

రెండుసార్లు మోగించిన తర్వాత, ఒక ముప్పై ముప్పై ఐదు సంవత్సరాల వయసున్న వ్యక్తి తలుపు తీసాడు. 'పనమ్మాయి కావాలని చెప్పినారంట' అన్న వసంత వాక్యం పూర్తికాకుండానే. "అవును, లోనికి రా" అని తలుపు తీసి గదిలోకి వెళ్ళిపోయాడు అతడు.

వసంత వంటగది లోకి వెళ్లేసరికి అతని భార్య రెండు కప్పుల్లో టీ కలిపి, 'చీపురు బయట ఉంటుంది. ముందు అక్కడ బయట ఉన్న కప్ తీసుకో. టీ తాగి మొదలు పెడుదువు గాని' అని చెప్పింది.

వసంత బయటినుండి కప్ తీసుకుని ఆమెకు ఇచ్చింది. రాగిణి ఆ కప్పులో టీ పోసి వసంతకు అందించి, తమ కప్పులు తీసుకుని పడగ్గది లోకి నడిచింది. టీ తాగి, పది నిముషాల్లో ఇల్లు ఊడ్చి గిన్నెలు కడగడం మొదలుపెట్టింది, వసంత. ఊడుస్తుంటే చూసింది... ఆ ఇంట్లో భార్యాభర్తలు మాత్రమే ఉంటారు. పిల్లలు లేనట్టుంది.

రెండు పడగ్గదుల్లో రెండు కంప్యూటర్లు సెటప్ చేసి ఉన్నాయి. కరోనా రోజుల్లో మొదలైన 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఇంకా కొనసాగుతున్నట్టుంది.

గిన్నెలు కడుగుతుండగానే ఉన్నట్టుండి పెద్దగా అరుపులు వినిపించాయి. తలుపు దగ్గరకు వేసి ఉంది కాబట్టి విషయం అర్థం కావట్లేదు గానీ, అతడు అరుస్తున్నాడు, ఆమె సమాధానం చెప్తోంది. చెవులు రిక్కించి వినగా వాళ్ళ మాటలు కొంచెం కొంచెం వినిపిస్తున్నాయి. "నాకన్నా ఎక్కువ సంపాదిస్తున్నావని పొగరా? ఐదువేలు పెట్టి హ్యాండ్ బ్యాగ్ కొంటావా? అదీ నన్ను అడగకుండా? మర్యాదగా రిటర్న్ చెయ్యి... లేదంటే ట్రాష్ లో పడేస్తా దాన్ని. చూస్తున్నా, ఈ మధ్య నీకు దుబారా ఎక్కువైంది. మొన్నటికి మొన్న కూడా 'టీం లంచ్' అని చెప్పి పదివేలు తగలేసావు" అని మండిపడ్డాడు.

"అది నిజంగా టీం లంచే. మేనేజరుగా నేనే కట్టాలి. లేకపోతే బాగుండదు. అది ఎలాగూ కంపెనీ రీయింబర్సు చేస్తుంది కదా! ఇప్పుడు కూడా నా పాత హ్యాండ్ బ్యాగ్ తెగిపోయింది. అందుకే, ఆఫర్ ఉందని కొన్నాను. ఏమైంది కొనుక్కుంటే?" అని ఆమె నచ్చజెప్తుండగానే... చెంప దెబ్బ కొట్టినట్లు, ఆ తర్వాత కప్ పగిలినట్లు శబ్దమైంది. విసురుగా మెయిన్ డోర్ తీసి వేసి బయటకు వెళ్ళిపోయాడు అతడు. 'ఏమైందా?' అని వసంత వెళ్లి చూసేసరికి, గదిలో చెల్లాచెదురుగా పడి ఉన్న కప్ ముక్కలను ఏరుతోంది, రాగిణి. వసంతను చూసి ఇబ్బందిగా ఒక నవ్వు నవ్వి మళ్ళీ ముక్కలు ఏరడంలో నిమగ్నమైంది. ఏరిన ముక్కలను తీసుకుని చెత్త డబ్బాలో వేసి, ఇల్లు తుడవడానికి బకెట్, కుంచె తీసుకుని వచ్చింది, వసంత.

వసంత ఇల్లు తుడుస్తున్నంత సేపూ నిశ్శబ్దంగా క్షణాలు గడిచాయి. మొత్తం పని పూర్తి చేసుకుని, 'పని అయిపోయింది అక్కా', అని చెప్పగానే, వంద రూపాయల నోటు చేతిలో పెట్టి, 'ఇందాక నువ్వు చూసింది ఎక్కడా చెప్పకు. సార్ చాలా మంచివాడు. ఈ విషయం ఇక్కడే మర్చిపో.' మెల్లగా చెప్పింది, రాగిణి.

'వంద' తీసుకుని బయటకు నడిచిన వసంత మనసు బాధగా మూలిగింది. 'చదువుసంధ్యలు లేని తమ ఇంట్లో పరిస్థితికీ, అంతంత చదువులు చదివి లక్షలు సంపాదించే రాగిణి వాళ్ళ ఇంట్లో పరిస్థితికీ పెద్ద తేడా ఏముంది? మా అయన మంచోడు అంటుంది. ఒక బ్యాగ్ కొనుక్కున్నందుకే కొట్టి, అంత లొల్లి చేసినోడు మంచోడు ఎట్లా అవుతడు?' అనుకుంటూ బయటకు నడిచింది. అప్పటికే సన్నగా వాన మొదలైంది. వెళ్ళడానికి ఆటోలు కూడా ఏవీ లేవు. చివరకు ఒక ఆటో లింగంపల్లి స్టేషన్ దాకా దొరికితే ఎక్కి కూర్చుంది. పదినిమిషాల్లో స్టేషన్ దగ్గర దిగి నడుస్తూండగా, బొయ్యిమన్న శబ్దం విని తుళ్ళి పడింది. పక్కకి చూస్తే, బైక్ మీద సురేష్. గుట్కా నమిలి నమిలి గార పట్టిన పళ్ళు కనిపించేలా నవ్వుతూ, "ఏం డార్లింగ్, ఇంటికేనా? నన్ను దింపమంటవా?" అడిగాడు. "అక్కర్లేదు, నువ్వు పో. నేను నడిచి పోతా" ఛీత్కారంగా చూస్తూ విసురుగా బదులిస్తూనే వడివడిగా నడవసాగింది, వసంత. "ఏం పోతవు తీ. బండెక్కి ఆనుకోని కూర్చో చాలు... వానల తడవకుండ తీస్కపోతా. రా" అని వసంతని పట్టుకోడానికి చెయ్యి చాచాడు, సురేష్.

"చెత్త మాటలు ఒర్లితే చెప్పు తెగుద్ది. పోరా పో" అంటూ విసురుగా వాడి చేతిని తోసేసింది. ఊహించని ఆ విసురుకి వాడు బండి బ్యాలన్స్ తప్పి కింద పడ్డాడు.

"నన్నే పడేస్తావా? నీ సంగతి సంతుగాడితో చెప్తా ఉండు. ఎవడిదో బండెక్కి తిరుగుతున్నావు, అదేంటి అని అడిగితే వానితో కొట్టించావని చెప్తా. ఈ రోజు నువ్వు సచ్చినవే!", పాములాగ బుస కొట్టాడు, సురేష్. వాడు కింద పడినందుకు జాలిపడే లోపే వాడు అన్న మాటలకి వసంత గుండె మండిపోయింది.

లేవబోతున్న వాడిని కాలితో ఒక్క తన్ను తన్నింది... దెబ్బకి వాడు బిత్తరపోయాడు... మళ్ళీ నా జోలికి వచ్చినవంటే బిడ్డా... ఆ కాల్వలో పెట్టి తొక్కుతా అని వేలు చూపిస్తూ ముందుకు నడిచింది. ఇంతలో చుట్టూ జనం కోపంగా పోగవుతుండటం చూసి లేచి బండి తీసుకుని వాడు పరార్.

సురేష్ గాడు భయపడి పారిపోవడం చూసి తనకి కొత్త శక్తి వచ్చినట్టు ఆయింది.

'బయట ఈ సురేష్ లాంటి గలీజ్ గాండ్లకీ, ఇంట్లో సంతుగాడికి, రేపు పెళ్లి అయినంక మొగునికి, ముసలితనంలో కన్నపిల్లలకీ  భయపడుతూనే బతకాలా? అసలు అట్లాంటి బతుకూ ఒక బతుకేనా? పొద్దున కుమారి అన్నట్టు ఎదురు తిరిగితే ఏమైతది? భయపడింది చాలు. ఇప్పటికైనా ఎవడు పడితే వాడు తొక్కనీకి తను 'డోర్ మ్యాట్' కాదు అని రుజువు చెయ్యాలి' అని నిర్ణయించుకుంది.

కురుస్తున్న చినుకుల్లో ఆమె బొట్టు కారిపోయింది. శుక్రవారం బోసి నుదురుతో ఎందుకని, దారిలో ఉన్న దుకాణం దగ్గర తనకు నచ్చిన బొట్టు బిళ్లల ప్యాకెట్ ఇరవై రూపాయలకు కొనుక్కుంది. అక్కడికక్కడే దాన్ని తెరిచి, ఒక 'దోసగింజ' బొట్టు బిళ్ళ పెట్టుకుని, ఇంటి వైపు సాగింది. ఇంటి ముందు చెప్పులు విప్పి, లోపలికి అడుగు పెట్టగానే ఎదురుగా గుంట నక్క లాగా కూర్చుని ఉన్న సంతుగాడు ఒక్క ఉదుటున లేచి, 'ఏందే, ఎవుడే వాడు? ఎవనితోనో బండి మీద తిరుగుతున్నావంట, అడిగితే సురేష్ గాణ్ణి కొట్టిచ్చినవంట" అంటూ ఆమె నుదుటి మీద బొట్టుబిళ్ల చూడగానే రెచ్చిపోయి, "రాతిరి అయింది సాల్లేదా? మళ్ళీ టికిలీలు కాయించినవ్ బజారు దానా' అని వసంత జుట్టు పట్టుకున్నాడు. అప్పటికే సంతుగాడి దౌర్జన్యాలతో విసిగిపోయి ఉన్న వసంత కోపానికి, కిశోర్–రాగిణి ల మధ్య జరిగిన సంఘటన, సురేష్ గాడి వేధింపులతో గట్టు తెగింది. అంతే ... భద్రకాళి అవతారం ఎత్తింది. వాడి పట్టు వదిలించుకుని, ఎడమచేత్తో చాచి ఒక్కటిచ్చింది. ఆర్టీసీ బస్సు గుద్దిన స్కూటర్ లాగా ఎగిరి గోడకు గుద్దుకుని పడ్డాడు, సంతుగాడు. అలా పడిన వాణ్ణి జుట్టు పట్టి పైకి లేపి, డొక్కలో మోచేత్తో ఒక్క పోటు పొడిచింది. నొప్పితో విలవిలలాడి పోయాడు వాడు. అయినా ఏ మాత్రం చలించకుండా ఇంకో నాలుగు తగిలించింది. 'అయ్యో అయ్యో అయ్యో, సంపుతవానే వాణ్ని? నీ చేతులు ఇరిగిపోనూ... నీ పీనిగెల్ల... ఒదులు వాణ్ని' అని లబలబలాడుతూ రాబోయిన వాళ్ళ అమ్మను ఒక్క తోపు తోసింది...

గబ గబ వెళ్ళి వంట గదిలో ఉన్న కత్తి పీట తీసుకొచ్చింది...

'ఇయ్యాల నించి ఆ సురేష్ గానితో గానీ, ఇంకే గాలిగాండ్లతో గానీ తిరిగినా, నా జోలికొచ్చినా నరుకుతా. అందరిలెక్క పనికి పోయి, పైసలు తెచ్చి, ఇంట్ల ఇచ్చి మంచిగా మనిషి లెక్క ఉంటడా, వీడు ఇంట్లో ఉంటడు. లేకపోతే గడప కూడా తొక్కనివ్వ. ఇష్టం లేకపోతే ఇద్దరూ ఇంట్లకెల్లి వెళ్లిపోవచ్చు. ఇది బాపు నా పేరు మీద కొన్న ఇల్లు. ఇంకెప్పుడైనా నా మీద పెత్తనం చెయ్యాలని చూసినారంటే తల్లీ, తమ్ముడని కూడా చూడను. చంపి బొందవెడ్త'... పదం పదం నొక్కి బలంగా, స్థిరంగా చెబుతున్న వసంత వైపు చేష్టలుడిగి చూస్తూ ఉండి పోయారు, సంతుగాడు, వాళ్ళమ్మ.

COMMENTS